## 13) ఉన్నవ లక్ష్మీనారాయణ

ఉన్నవ లక్ష్మీనారాయణ గారు గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకాలోని వేములపాడు గ్రామంలో 1873 లో జన్మించారు. వీరి దృక్పథం గాంధీ తత్వం.

1920లో లక్ష్మీనారాయణ గారు 'మాలపల్లి' నవలను రచించారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత, జాతీయ వాదం, దళిత జనోద్ధరణ మాలపల్లి నవలకు నేపథ్యం. 1902లో గుంటూరులో వీరేశలింగం పంతులు గారి అధ్యక్షతన తొలి వితంతు వివాహం జరిపించారు. పలనాడు పుల్లరి సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. రాయవెల్లూరు జైలులో ఉన్నప్పుడు మాలపల్లి నవల రాయడం ప్రారంభించారు.

ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ నవలను నిషేధించింది. 1928లో కొన్ని మార్పులతో ప్రచురణకు అనుమతి లభించింది. 1935 రెండోసారి నిషేధానికి గురైంది. 1937లో సి.రాజగోపాలాచారి ప్రతినిధిగా కాంగ్రెస్ మంత్రి వర్గం ఏర్పడిన తరువాత మాలపల్లి పై నిషేధం రద్దు అయింది.

**మాలపల్లి కథ:** మంగళాపురం గ్రామంలో రామదాసు వ్యవసాయదారుడు. పెద్దకొడుకు వెంకటదాసు, రెండవ కొడుకు సంగదాసు. సంగదాసు ఊరి షావుకారు చౌదరయ్య దగ్గర పెద్ద జీతగాడు. చౌదరయ్య స్వార్థపరుడు, కష్టజీవుల కడుపు కొట్టడానికి కూడా సిగ్గపడడు . అతడి కొడుకు రామానాయుడు నిరహంకారి, పేదలంటే ప్రేమ ఉన్న వాడు. సంగదాసు తన వారి తరఫున కూలీ విషయమై చౌదరయ్యతో వాదించి కూలీని పెంచి విజయం సాధించాడు. అప్పటినుండి సంగదాసుపై చౌదరయ్య ద్వేషాన్ని పెంచుకున్నాడు .తన కుమారుడు రామానాయుడు తో స్నేహం చేస్తున్నందుకు మండిపడ్డాడు, పగపట్టాడు.రామదాసు పొలాన్ని సొంతం చేసుకున్నాడు. పెద్ద కొడుకు వెంకటదాసు ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. సంగదాసును కొట్టి చంపాడు . సంగదాసు మనమే గెలుస్తామని పలవరించి తుది శ్వాస విడిచాడు.

''మాలపల్లి'' కథ మాత్రమే కాదు, అందులోని పాత్రలు కూడా ప్రత్యేకమైనవే. సంగదాసు పాత్ర చిత్రణ ప్రత్యేకించి పేర్కొనదగినది. చౌదరయ్యను ప్రశ్నించిన సంగదాసును చౌదరయ్య చావగొట్టినపుడు రచయిత వర్ణన స్మరణీయం. ఈ

వర్ణనను బట్టి ఉన్నవ లక్ష్మీనారాయణ గారి దృష్టి ఎటువంటిదో స్పష్టమైంది.

1920 నాటికి కార్మికోద్యమం,రైతు ఉద్యమం, స్వాతంత్రం మొదలైన వాటిని ఈ నవలలో చూడవచ్చు. 'మాలపల్లి' నవలకు 'సంగవిజయం' అనే పేరు కూడా ఉంది.

నవలా వికాస చరిత్రలో మాలపల్లి నవల ఎవరెస్టు శిఖరం వంటిది. ఆ కాలపు సాంఘిక, రాజకీయ, ఆర్థిక ,సాంస్కృతిక పరిణామాలకు దర్పణం వంటిది.